


ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు
తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 57 తిరుపతి తేది : శుక్రవారం 29 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

## జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలి

- అంతర్రాష్ట్ర జలవివాదాలు.. కెన్-బెట్వా ప్రాజెక్టును ఉదహరించిన ప్రధాని మోదీ
- సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా సమస్యలను అధిగమించాలన్న మోదీ
- ఆయా రాష్ట్రాల్లోని రూ.30 వేల కోట్ల అభివృద్ధి పనులపై సమీక్ష




**న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 28**

అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక సూచన చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కెన్-బెట్వా ప్రాజెక్టు నమూనాను ఉదహరించారు. భారతదేశంలో మొట్టమొదటి నదుల అనుసంధాన ప్రాజెక్టు కెన్-బెట్వా ప్రాజెక్టు. మధ్యప్రదేశ్‌లోని కెన్ నదిలో ఉన్న అదనపు జలాలను కాలువ ద్వారా ఉత్తరప్రదేశ్‌లోని బెట్వా నదికి మళ్లిస్తారు. ఈ నేపథ్యంలో మోదీ మాట్లాడుతూ, రాష్ట్రాల మధ్య నీటి సమస్యల పరిష్కారానికి ఇది ఆదర్శ మోడల్‌గా పేర్కొన్నారు. ప్రధాని మోదీ కెన్ - బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం, ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ - అర్బన్ 2.0ను కూడా సమీక్షించారు. ఆయా నగరాల్లో రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలను అన్వేషించాలని అన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని ప్రధాని మోదీ సూచించారు.

# సీఎం సిద్ధరామయ్య రాజీనామా

- డీకే శివకుమార్‌కు లైన్ క్లియర్?
- అందుబాటులో లేని గవర్నర్... కార్యదర్శికి రాజీనామా లేఖ అందజేత



**బెంగలూరు - ఆంధ్రనాడు, మే 28**

కర్నాటకలో కాంగ్రెస్ మార్క్ రాజకీయం మొదలైంది. పార్టీకి సంపూర్ణ మెజార్టీ ఉన్నా, ఐదేండ్లు ఒకే వ్యక్తిని ముఖ్యమంత్రి సీట్లో కొనసాగించలేని నిస్సహాయస్థితిలో ఆపార్టీ నాయకత్వం ఉంది. దీనికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామానే ప్రత్యక్ష? సాక్ష్యం. ఆయన స్థానంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను సీఎం చేస్తారని ప్రచారం జరుగుతుంది. అసలు సిద్ధ రామయ్యతో ఎందుకు రాజీనామా చేయించారు అనే విషయంపై కాంగ్రెస్ అధిష్టానం

- మిగతా 2లో..

# ఎన్టీఆర్‌కి భారత రత్న ఇవ్వాలి

- మహానాడులో ఏకగ్రీవ తీర్మానం
- తెలుగుజాతి ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ప్రతీక
- మహిళలకు ముప్పై మూడు శాతం సీట్లు ఎన్టీఆర్ ఆశయమే



**అమరావతి - ఆంధ్రనాడు, మే 28**

చరిత్ర ఉన్నంతకాలం తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్‌కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని ప్రజలందరి ఆకాంక్ష అని పేర్కొన్నారు. మహానాడులో మాట్లాడిన చంద్రబాబు, ఎన్టీఆర్ సేవలు

- మిగతా 2లో..

# యువతకు అవకాశాల వెల్లువ..

- నైపుణ్యాలతో సిద్ధంగా ఉండండి
- జెన్-జీతో మంత్రి లోకేష్
- రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నామన్న మంత్రి లోకేష్
- అవకాశాలకు అనుగుణంగా యువతను నైపుణ్య వనరులుగా తీర్చిదిద్దుతాం
- సోషల్ మీడియాలోని ఫేక్ కంటెంట్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచన
- విజయానికి దగ్గరి దారులు లేవని, కష్టపడితేనే ఫలితం ఉంటుందన్నారు
- యువత రాజకీయాల్లోకి రావాలని, టీడీపీ అవకాశాలు కల్పిస్తుందని పిలుపు



**అమరావతి- ఆంధ్రనాడు, మే 28**

యువత అంకితభావం, సమష్టి కృషి, త్యాగనిరతి వంటి గుణాలను అలవర్చుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు యువతను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మహానాడు సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో "జెన్-జీ" యువతతో ఆయన ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వ దార్శనికతను వివరించారు.

**క్లస్టర్ విధానంతో పారిశ్రామిక ప్రగతి**

రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం క్లస్టర్ ఆధారిత విధానంతో ముందుకు సాగుతోందని లోకేష్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించామని, డేటా, ఐటీ, క్వాంటం టెక్నాలజీ, రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధన వనరుల వంటి రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీనివల్ల ఒకేచోట ప్రధాన పరిశ్రమలతో పాటు, వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ

- మిగతా 2లో..

## క్షేత్రస్థాయిలో పోరాడినట్టే సోషల్ మీడియాలోనూ పోరాడాలి

- మహానాడు-2026లో రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర రామ్మోహన్ నాయుడు
- ఎన్టీఆర్ ఆత్మగౌరవం, చంద్రబాబు ఆత్మవిశ్వాసం, లోకేష్ మనోధైర్యం పెంచారన్న రామ్మోహన్
- రాష్ట్రానికి సుస్థిర పాలన అందించడం టీడీపీ బాధ్యత అని స్పష్టీకరణ

**అమరావతి- ఆంధ్రనాడు, మే 28**



క్షేత్రస్థాయిలో పార్టీ కోసం ఎంతగా శ్రమిస్తున్నామో, అదే స్థాయిలో సోషల్ మీడియాలో కూడా కష్టపడాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి పోరాటంతో పాటు, ఆన్‌లైన్‌లో కూడా పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన

- మిగతా 2లో..

ANDHRANADU
TELUGU DAILY

శుక్రవారం
29.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# యువతకు అవకాశాల వెల్లువ..

(మొదటిపేజీ తరువాయి)

యూనిట్లు ఏర్పాటవుతాయని, తద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకోసిస్టమ్) నిర్మితమవుతుందని అన్నారు. “రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి” అని ఆయన సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యప్రణాళికలో మార్పులు తెచ్చి, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందిస్తామన్నారు.ః

**సోషల్ మీడియా ఫేక్ కంటెంట్‌పై అప్రమత్తత అవసరం**

సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే తప్పుడు సమాచారం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. డీఎస్సీ విషయంలో ప్రతిపక్ష నేత నిరాధార ఆరోపణలు చేసి లక్షలాది మంది యువతను ఆందోళనకు గురిచేశారని విమర్శించారు. “మేం పారదర్శకంగా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేశాం. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా, వాస్తవాలను సరిచూసుకోవాలి,” అని ఆయన యువతకు హితవు పలికారు.

**విజయానికి దగ్గరి దారులు లేవు**

కష్టపడటం ఒక్కటే విజయానికి మార్గమని, దానికి దగ్గరి దారులు ఉండవని లోకేష్ తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. “నేను మా నాన్నగారితో పోటీ పడాలంటే ఆయన కంటే ఎక్కువ కష్టపడాలి. నా పాదయాత్రలో రోజూ పోరాటం ఎదుర్కొన్నాను. 2019లో ఓడిపోయినా భయపడలేదు, 2024లో 91 వేల మెజారిటీతో గెలిచాను. ఆ రోజు భయపడి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు” అని అన్నారు. పరీక్షల్లో విఫలమైతే ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని, ఒక్క ఓటమి జీవితాన్ని నిర్ధారించదని విద్యార్థులకు ధైర్యం చెప్పారు.

**యువత రాజకీయాల్లోకి రావాలి**

యువత రాజకీయాల్లోకి రావాలని, తెలుగుదేశం పార్టీ వారికి సముచిత అవకాశాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. మహిళా సాధికారత ప్రతి ఇంటి నుంచే మొదలుకావాలని, వారికి 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ఏకైక అజెండా అని, పెద్ద పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు వేమూరి సాత్విక్, చరణ్ యాదవ్, సత్యసాయి పవన్ కుమార్, ఖ్యాతి వర్ధిని పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లను ఎత్తివేయొద్దని అసెంబ్లీ సాక్షిగా చెప్పినా జగన్ వినలేదు

**- జగన్ హయాంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్న అచ్చెన్నాయుడు**
**- చేసిన అభివృద్ధిని చెప్పుకోకపోవడం వల్లే 2019లో టీడీపీకి నష్టం జరిగిందని వ్యాఖ్య**
**- వైసీపీ మరోసారి అధికారంలోకి రాకుండా పాతిపెడదామన్న అచ్చెన్న**

అమరావతి– ఆంధ్రనాడు, మే 28



వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు గుప్పించారు. మహానాడులో ఆయన మాట్లాడుతూ... జగన్ హయాంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని అన్నారు. ఏ రాష్ట్రానికైనా పరిశ్రమల ద్వారానే ఆదాయం, ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 24 నెలల కూటమి పాలనలో రాష్ట్రానికి రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. పేదలకు రూ. 5కే కడుపు నింపే అన్న క్యాంటీన్లను ఎత్తివేయొద్దని అసెంబ్లీ సాక్షిగా చెప్పినా.. ఆనాడు జగన్ వినిపించుకోలేదని అచ్చెన్న విమర్శించారు. అన్న క్యాంటీన్లను తొలగించారని దుయ్యబట్టారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకే జగన్ మూడు రాజధానులు అన్నారని విమర్శించారు. మూడు ప్రాంతాల్లోనూ ఎన్నికల్లో జగన్ కు ఎదురుదెబ్బ తగిలిందని ఎద్దేవా చేశారు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ఏపీలో ఎంతో అభివృద్ధి జరిగిందని... కానీ దాన్ని మనం చెప్పుకోలేదని అచ్చెన్న అన్నారు. అదే సమయంలో జగన్ చెప్పిన అబద్ధాలను ప్రజలు నమ్మడంతో 2019లో టీడీపీకి నష్టం జరిగిందని చెప్పారు. ఈసారి ప్రజలకు అలాంటి ఛాన్స్ ఇవ్వొద్దని... మన ప్రభుత్వం చేసిన మంచి పనులను, అభివృద్ధిని ప్రజలకు వివరించి వారిని చైతన్యపరచాలని అన్నారు. రాష్ట్రంలో మరోసారి వైసీపీ అధికారంలోకి రాకుండా పాతిపెడదామని చెప్పారు.

# సీఎం సిద్ధరామయ్య రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటి వరకు నోరువిప్పలేదు. ఇలాంటి చర్యల వల్లే ఫాసిస్టు పార్టీలకు ఆయుధాలు ఇచ్చినట్టు అవుతున్నదని కాంగ్రెస్ కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. గురువారం మధ్యాహ్నం కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి లోక్‌భవన్‌కు వెళ్లారు. ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ ను అందజేశారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. గవర్నర్ బెంగళూరుకు తిరిగి వచ్చిన తర్వాత రాజీనామాపై అధికారిక నిర్ణయం తీసుకోనున్నట్లు లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి.

**రిటైర్మెంట్ తీసుకోను**

“జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను ఐదేండ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేండ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతా” అని స్పష్టం చేశారు.

**పొరపాటుగా రాజకీయాల్లోకి వచ్చా..**

ఈ సందర్భంగా సిద్ధరామయ్య తన రాజకీయ ప్రస్థానాన్ని, గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. “నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించా. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా.

మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశా. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదు” అని సిద్ధరామయ్య వివరించారు. సిద్ధరామయ్య గురువారం సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నట్టు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయమైనట్టు కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై ఎలాంటి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు

**అధిష్టానం ఆదేశాల మేరకే**

కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పదవి నుంచి వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించి న అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమి చ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. అని సీఎం సిద్ధరామయ్య రాజీనామా అనంతరం మీడియాకు చెప్పారు. ఆ సమయంలో ఆయన వెంట మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వర ఉన్నారు.

# ఎన్టీఆర్‌కి భారత రత్న ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికే కాక దేశానికీ విశేషమని కొనియాడారు. ఆయన ఆలోచనలు, ప్రజాసేవా దృక్పథం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. మహానాడులో ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారని చంద్రబాబు వెల్లడించారు. రాజకీయాల్లో కొత్త సంస్కృతికి నాంది పలికిన నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, పేదల సంక్షేమం, తెలుగు గౌరవం కోసం ఆయన చేసిన కృషి అపారమని చెప్పారు. దేశ రాజకీయ చరిత్రలో ఎన్టీఆర్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని వ్యాఖ్యానించారు.ఎన్టీఆర్ ఆశయ సాధనలో భాగంగానే మహిళలకు ముప్పై మూడు శాతం సీట్ల ప్రకటనను నారా లోకేశ్ చేశారని చంద్రబాబు తెలిపారు. మహిళలకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించాలన్నది ఎన్టీఆర్ ఆలోచన అని చెప్పారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని, ఆ సిద్ధాంతం శాశ్వతంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పార్టీని స్థాపించిన కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని సాధించడం ఎన్టీఆర్‌కే సాధ్యమైందని చంద్రబాబు గుర్తు చేశారు. భారత రాజకీయ చరిత్రలో అది అరుదైన ఘట్టమని అన్నారు. ప్రజల్లో ఎన్టీఆర్‌కు ఉన్న విశ్వాసం, అభిమానమే ఆ విజయానికి కారణమని పేర్కొన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. సినీ రంగంలోనూ ఎన్టీఆర్ అపూర్వ ప్రతిభ కనబరిచారని చంద్రబాబు అన్నారు. ఆయన పోషించిన పాత్రలకు ప్రత్యామ్నాయం లేదని, ఆ పాత్రలను మళ్లీ చేయాలంటే ఆయనే మళ్లీ పుట్టాలని వ్యాఖ్యానించారు. పురాణ పాత్రల్లో ఎన్టీఆర్ నటన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. రాజకీయ నాయకుడిగానే కాక కళాకారుడిగా కూడా ఆయన అపూర్వ ముద్ర వేశారని చెప్పారు. మహానాడులో ఎన్టీఆర్ సేవలను గుర్తుచేసుకుంటూ పలువురు నాయకులు నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు ప్రజలకు మరింత చేరువ కావాలని నేతలు ఆకాంక్షించారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలోనే పార్టీ ముందుకు సాగుతుందని నాయకత్వం స్పష్టం చేసింది.

# అది గొడ్డలి పార్టీ, మాది రాజ్యాంగాన్ని నమ్మిన పార్టీ

**- హోం మంత్రి అనిత**
**- టీడీపీ మహానాడులో అనిత ప్రసంగం**
**- ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు**
**- చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్న అనిత**
**- 20 ఏళ్లు టీడీపీ అధికారంలో ఉంటే ఏపీ ప్రపంచంలోనే నెంబర్ వన్**
**- మహానాడును మహిళలకు అంకితమివ్వడంపై చంద్రబాబుకు ధన్యవాదాలు**



అమరావతి– ఆంధ్రనాడు, మే 28

తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల పాలన విధ్వంసకరంగా సాగిందని, అది ప్రజావేదిక కూల్చివేతతో మొదలైందని ఆరోపించారు. ప్రత్యర్థి పార్టీని”గొడ్డలి పార్టీ”గా అభివర్ణించిన ఆమె, టీడీపీ రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీ అని స్పష్టం చేశారు. మహానాడు రెండో రోజు రాజకీయ తీర్మానాన్ని బలపరుస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి కోసం పోరాడిన మహిళలను బూటుకాళ్లతో తొక్కించారని, నారా లోకేష్ చేపట్టిన ‘యువగళం’ పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని అనిత ధ్వజమెత్తారు. దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని మండలికి పంపిన నీచపు ఘనత ఆ పార్టీదేనని తీవ్రంగా విమర్శించారు. తాము గొడ్డళ్లు చేతికిచ్చే పార్టీ కాదని, యువనేత లోకేష్ రాజ్యాంగబద్ధమైన పాలన అందిస్తారని, ఆయన చేతిలో ఉన్నది ‘రెడ్ బుక్’ అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అనిత అన్నారు. 2014లో నవ్యాంధ్రకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు, అమరావతి, పోలవరం పనులను పరుగులు పెట్టించారని గుర్తు చేశారు. రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000కు పెంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు. రానున్న 20 ఏళ్లు ఇదే ప్రభుత్వం కొనసాగితే, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ మహానాడును మహిళలకు అంకితం చేసిన చంద్రబాబుకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**గత పాలనలో విధ్వంసమే: సోమిరెడ్డి**

తెలుగుదేశం పార్టీ మహానాడు-2026 రెండో రోజు సమావేశాలు వాడివేడిగా సాగాయి. మౌలిక సదుపాయాలు, దేవాలయాల పరిరక్షణపై ప్రవేశపెట్టిన తీర్మానాల సందర్భంగా టీడీపీ నేతలు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. మౌలిక సదుపాయాలపై ప్రవేశపెట్టిన తీర్మానంపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. 2019-24 మధ్య వైసీపీ పాలనలో రాష్ట్రంలో కేవలం 1,800 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే నిర్మించారని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 5,050 కిలోమీటర్ల రహదారులను నిర్మించిందని ఆయన పోల్చి చెప్పారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలోని రోడ్లలో 50 శాతం దెబ్బతిన్నాయని ఆరోపించారు. అమరావతి కోసం భూములిచ్చిన రైతులు 1,631 రోజుల పాటు ఉద్యమం చేశారని, ఈ పోరాటంలో 230 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. “మావిగన్” పేరుతో వైసీపీ డ్రామాలు ఆడుతోందని, వారి గన్ కల్చర్ ఇంకా పోలేదని విమర్శించారు.

**‘గొడ్డలి పార్టీ’ పాలనలో దేవాలయాలు ధ్వంసమయ్యాయి: పనబాక లక్ష్మి**

దేవాలయాల పరిరక్షణ తీర్మానంపై టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి ప్రసంగించారు. ‘గొడ్డలి పార్టీ’ పాలనలో దేవాలయాలు ధ్వంసమయ్యాయని, తిరుపతి లడ్డూను అపవిత్రం చేశారని ఆమె ఆరోపించారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులను గత ప్రభుత్వంలోని నేతలు దోచుకున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం అర్చకుల వేతనాలు, ధూప దీప నైవేద్యాల నిధులను పెంచిందని, వేద పండితులకు గౌరవ వేతనం అందిస్తోందని తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో దేశవ్యాప్తంగా 5,000 దేవాలయాల నిర్మాణం చేపట్టామని వివరించారు.

# క్షేత్రస్థాయిలో పోరాడినట్టే సోషల్ మీడియాలోనూ పోరాడాలి

(మొదటిపేజీ తరువాయి)

అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. గురువారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న మహానాడు-2026 రెండో రోజు కార్యక్రమంలో ఆయన రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టి, సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, 1982లో ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీని స్థాపించి దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారని గుర్తుచేశారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే కాంగ్రెస్‌ను గద్దె దించి అధికారంలోకి వచ్చిన ఘనత టీడీపీదని అన్నారు. “సమాజమే దేవాలయం -- ప్రజలే దేవుళ్లు” అనే ఎన్టీఆర్ సిద్ధాంతాన్ని చంద్రబాబు తన పాలనలో నిజం చేసి చూపిస్తున్నారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించి, యువతను ప్రోత్సహించిన పార్టీ టీడీపీ అని తెలిపారు.

పార్టీ మూడు తరాల నాయకత్వం గురించి ఆయన ఆసక్తికరంగా వివరించారు. ఎన్టీఆర్ తెలుగువారికి ఆత్మగౌరవాన్ని నేర్పితే, చంద్రబాబు “విజన్” అనే పదానికి అర్థం చెప్పి రాష్ట్రానికి ఆత్మవిశ్వాసాన్ని పెంచారని అన్నారు. ఇక నారా లోకేష్, “ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్” నుంచి “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్” స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లి కేవలం రెండేళ్లలో రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవం అయితే, చంద్రబాబు ఆత్మవిశ్వాసం పెంచారని, ఇప్పుడు లోకేష్ మనో ధైర్యాన్ని నింపుతున్నారని అభివర్ణించారు.

తమ పార్టీ మూడు తరాలుగా మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, డ్వాక్రా సంఘాలు, 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి ఉన్నతికి పాటుపడితే, ప్రతిపక్ష పార్టీ మాత్రం మూడు తరాలుగా వేట కొడవళ్లు, కత్తులు, గొడ్డళ్ల సంస్కృతిని ప్రోత్సహించిందని ఆయన విమర్శించారు. గత 44 ఏళ్లుగా ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొని టీడీపీ నిలబడిందని, ఈసారి రాజకీయ తీర్మానంలో “సంకల్పం, కర్తవ్యం” అనే రెండు అంశాలు కీలకమని అన్నారు. రాష్ట్రానికి సుస్థిరమైన పరిపాలన అందించాల్సిన బాధ్యత, కర్తవ్యం తెలుగుదేశం పార్టీపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ మహత్తర కార్యక్రమానికి తరలివచ్చిన 15 లక్షల మంది కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

# విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండండి

## - ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి సూచన





**తిరుపతి–ఆంధ్రనాడు, మే 28:** బలమైన గాలి, వర్షం కురిసే సందర్భాల్లో విద్యుత్ ప్రమా దాలు జరగకుండా విని యోగ దారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ ఌ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం ఒక ప్రకటనలో కోరారు. బలమైన గాలి, వర్షం కారణంగా సంస్థ పరిధిలో అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్తు లైన్లు తెగిపోవడం లాంటి సంఘటనలు జరిగాయన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగిన సందర్భాల్లో వినియోగదారులు తెగిపడిన విద్యుత్ తీగలను తాకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బలమైన గాలి, వర్షం కురిసే సందర్భాల్లో వినియోగదారులు విద్యుత్ తీగల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లకు దగ్గరగా నిలబడవద్దని సూచించారు. తమ ప్రాంతంలో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపోవడం లాంటి సంఘటనలను గుర్తించినట్లయితే వినియోగదారులు వెంటనే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులకు గానీ లేదా సిబ్బందికి గానీ సమాచారాన్ని అందించాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్ బిల్లుపై ముద్రించబడిన తమ ప్రాంత అసిస్టెంట్ ఇంజనీర్ మొబైల్ నంబరుకు గానీ లేదా విద్యుత్ శాఖ టోల్–ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమాచారాన్ని తెలియజేయవచ్చని సూచించారు.

**విద్యుత్తు తీగ తెగిపడడంతో మహిళ, గేదెలు మృతి బాధాకరం**

ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గం, సీతారామపురం సెక్షన్ పరిధిలో బలమైన గాలి, వర్షం కారణంగా ఈనెల 27వ తేదీన రెండు వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్తు తీగలు తెగిపడడంతో ఒక మహిళ, గేదెలు మృతిచెందిన సంఘటన బాధాకరమని ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీన తెల్లవారుజామున తెగిపడిన విద్యుత్ తీగను తాకిన కారణంగా బసినేపల్లి పంచాయతీ, కొయ్యలపాడు గ్రామానికి చెందిన చలసాని వెంకటసుబ్బమ్మ (56) మృతి చెందారని, అదే మండలంలోని గంగవరం గ్రామంలో అదే రోజు మధ్యాహ్నం కొంతమంది రైతులకు చెందిన పశువులు పొలంలో మేస్తున్న సందర్భంలో విద్యుత్తు తీగ తెగి గేదెలపై పడడంతో గేదెలు మృతి చెందాయని తెలిపారు. విద్యుత్ శాఖ నిబంధనల మేరకు బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ‘సూర్యశక్తి’దే భవిష్యత్తు

- మీ ఇంటి పైకప్పే సోలార్ ప్లాంట్
- సోలార్ పై వినియోగదారుల్లో పెరుగుతున్న ఆసక్తి
- ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో 78,250 రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు
- 201 యండబ్ల్యుపి సోలార్ విద్యుదుత్పత్తి

**తిరుపతి–ఆంధ్రనాడు, మే 28:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పిడిసిఎల్) పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సోలార్ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలను అనుగుణంగా సాంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించేందుకు ఎపిఎస్పిడిసిఎల్ నిరంతరం కృషి చేస్తోంది. దేశంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ బిల్లుల పెరుగుదల వినియోగదారులకు భారంగా పరిణమిస్తున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇంటిల్లిపాదిని చల్లబరిచేందుకు వినియోగదారులు ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లను వాడాల్సిన అవసరం ఏర్పడుతోంది. విద్యుత్ వినియోగానికి అనుగుణంగా బిల్లుల్ని చెల్లించాల్సి వుండడంతో వినియోగదారులు సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంపై మొగ్గు చూపుతున్నారు. దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న ఇంధన వినియోగం, కాలుష్యం పెరుగుదల, వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను దృష్టిలో వుంచుకుని వినియోగదారుల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా గృహంపై సోలార్ ప్యానెళ్ళను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులు ఉచితంగా సౌరశక్తిని పొందడంతోపాటు విద్యుత్ బిల్లులను ఆదా చేసుకునే వెసులుబాటు లభిస్తోంది. సోలార్ నెట్ మీటరింగ్ ద్వారా అదనపు విద్యుత్తును వినియోగదారులు గ్రిడ్ కు పంపి, ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఏర్పడింది.

సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకోదలచిన వినియోగదారులు తొలుత కేంద్ర ప్రభుత్వ అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తును సంబంధిత విద్యుత్ పంపిణీ సంస్థ పరిశీలించి, ప్రాథమిక అనుమతిని మంజూరు చేసిన తర్వాత వినియోగదారులు ప్రభుత్వ అనుమతి పొందిన సోలార్ ఏజెన్సీల ద్వారా సోలార్ ప్యానెల్స్ ను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటులో నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక నిబంధనలను తప్పనిసరిగా పాటించే విధంగా వినియోగదారులు అప్రమత్తంగా వుండాలి. రూఫ్ టాప్ సోలార్ ఇన్స్టాలేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత నెట్ మీటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుంది. అనంతరం సంబంధిత అధికారులు ఇన్స్ పెక్షన్ ను పూర్తి చేసిన తర్వాత సబ్సిడీ మొత్తాన్ని వినియోగదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుంది.



రూఫ్ టాప్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా వివిధ బ్యాంకులు వినియోగదారులకు లోన్ ను కూడా మంజూరు చేస్తున్నాయి. అంతేకాకుండా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండడంతో వినియోగదారులపై భారం గణనీయంగా తగ్గుతోంది. గృహంపై 2 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు రూ. 1.5 లక్షలు వ్యయం అవుతుండగా, అందులో రూ. 60,000లను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో వినియోగదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల వరకు గరిష్ఠంగా రూ. 78,000లను సబ్సిడీ రూపంలో భరిస్తుంది. ఈ సబ్సిడీ ద్వారా వినియోగదారులు తక్కువ పెట్టుబడితోనే విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడంతోపాటు దీర్ఘకాలిక లాభాలను ఆర్జించేందుకు అవకాశం ఏర్పడుతోంది. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ వినియోగాన్ని బట్టి సోలార్ ప్యానెల్స్ సామర్థ్యాన్ని ఎంచుకోవాల్సి వుంటుంది.

విద్యుత్ వినియోగం నెలకు 150 యూనిట్ల వరకు వున్నట్లయితే 1 కిలోవాట్టు, 150 నుంచి 300 యూనిట్ల మధ్య వున్నట్లయితే 2 కిలోవాట్లు, 300 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగం వున్నట్లయితే 3 లేదా అంతకంటే ఎక్కువ కిలోవాట్ల సామర్థ్యాన్ని ఎంచుకోవాల్సి వుంటుంది. రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ రోజుకు సుమారుగా 8 నుంచి 10 యూనిట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు అవకాశం వుంటుంది. దీనిప్రకారం వాతావరణ పరిస్థితుల ఆధారంగా నెలకు సుమారుగా 200 నుంచి 300 యూనిట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ద్వారా ప్రతి గృహం స్వయంచాలక విద్యుత్ ఉత్పత్తిదారుగా మారే సువర్ణ అవకాశం వుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వగ్రామమైన నారావారిపల్లెలో ప్రతి ఇంటిపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా నారావారిపల్లె సోలార్ గ్రామంగా రూపుదిద్దుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను అనుగుణంగా ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం వున్న 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు ఒక్కో గృహంపై 2 కిలోవాట్ల చొప్పున మొత్తం 415 యండబ్ల్యుపి సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసే ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. సంస్థ పరిధిలో ఇప్పటివరకు 46,049 రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా 92.10 యండబ్ల్యుపి సామర్థ్యం గల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. అలాగే ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇతర వర్గాల గృహాలపై క్యాపెక్స్ విధానంలో 32,201 రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయడం ద్వారా 108.86 యండబ్ల్యుపి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది.

కుప్పం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో 1,980 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ప్రతి గృహంపై 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా 4.36 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అదేవిధంగా అక్కడే 98 ఎస్సీ, ఎస్టీయేతర వినియోగదారుల గృహాలపై కూడా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగింది.

**సోలార్ విద్యుత్తుకు మరింత ప్రోత్సాహం: శివశంకర్ లోతేటి, చైర్మన్ ఌ మేనేజింగ్ డైరెక్టర్**

సోలార్ విద్యుత్ వినియోగాన్ని మరింత ప్రోత్సహించేందుకు వీలుగా ఎస్సీ,ఎస్టీయేతర విద్యుత్ వినియోగదారుల గృహాలపై కూడా సోలార్ ప్యానెల్స్ ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగానే సంస్థ పరిధిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువుగా వున్న బిసిల గృహాలపై కూడా రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. అంతేకాకుండా సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్లు జీవితకాలం సురక్షితంగా, సమర్థవంతంగా, నమ్మకంగా పనిచేసేందుకు వీలుగా రూఫ్ టాప్ సిస్టమ్స్ ను అమర్చే సందర్భంలో నాణ్యత, సాంకేతిక, భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. అలాగే సోలార్ సిస్టమ్స్ నిర్వహణపై వినియోగదారులకు మరింత అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం.

# ఎన్టీఆర్ దేశ రాజకీయాల్లో ఓ ప్రభంజనమై ఉద్భవించిన వ్యక్తి

## - ఎమ్మెల్యే కిషోర్



**పీలేరు–ఆంధ్రనాడు,మే 28:** పర్చువల్ విధానంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమం రెండో రోజు పీలేరు నియోజకవర్గంలో ఉత్సాహంగా కొన సాగింది. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, నల్లారి అభిమానులతో కలిసి మహానాడులో పాల్గొని టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపారు. ‘సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు’ అనే సిద్ధాంతాన్ని నమ్మి చివరి శ్వాస వరకు సామాన్యుడి సంక్షేమం కోసం పరితపించిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, విశ్వవిఖ్యాత గాంచిన నటసార్వ భౌముడు నటరత్న పద్మశ్రీ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే కిషోర్ ఘనంగా నివాళులర్పించారు. గురువారం ఉదయం నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా 10 క్లస్టర్లలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యకర్తలను, ప్రజలను అనుబంధ సంఘాలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సామాన్యుడు సంక్షేమం కోసం నడుము కట్టి తెలుగుదేశం పార్టీ ఆశయాలకు శ్రీకారం చుట్టి ఓటర్ల నాడీ కనిపెట్టి వంటి చేత్తో వందేళ్ల కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించి రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన మేరునగ ధీరుడు ఎన్టీఆర్ అంటూ కొనియాడారు. 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపించిన కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి, తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో రాజకీయ చరిత్ర సృష్టించారు ఎన్టీఆర్. ముఖ్యమంత్రిగా ?2కే కిలో బియ్యం పథకం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు వంటి విప్లవాత్మక సంస్కరణలతో, అనేక సంక్షేమాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. క్రమశిక్షణే ధ్యేయంగా లక్షల మంది కార్యకర్తలకు దిక్సూచిగా నిలిచిన ఎన్టీఆర్ ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# జగన్మోహన్ రెడ్డిని కలిసిన రాజేష్



**తిరుపతి, మే 28 (ఆంధ్రనాడు):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గురువారం సత్యవేడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నూక తోటి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి బి ఎల్ ఏ లు నియామకం పార్టీ కార్యకర్తల రిజిస్ట్రేషన్ లపై ప్రత్యేక దృష్టి సారించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్మోహన్ రెడ్డి తెలియజేసినట్లు రాజేష్ తెలిపారు. అలాగే నియోజకవర్గంలో అందుబాటులో ఉండి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి పార్టీ కోసం కృషి చేయాలని తెలియజేసినట్లు పేర్కొన్నారు.

# మహానాడుకు హాజరైన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



**పలమనేరు–ఆంధ్రనాడు, మే 28:** స్థానిక లయన్స్ క్లబ్ లో పలమనేరు రూరల్ మండల నాయకుల ఆధ్వర్యంలో జరిగిన రెండో రోజు మహానాడు ముగింపు కార్యక్రమానికి గురువారం చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షులు షణ్ముఖ రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎస్.నాగరాజ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్,బయ్యప్పగారి పల్లె సింగల్ విండో అధ్యక్షులు వెంకట ముని రెడ్డి,నాయకులు భరత్ బెజవాడ, జగదీష్ నాయుడు, పెద్దబ్బ, కె.అమరనాథ్ రెడ్డి, నరేష్ రెడ్డి, స్వతంత్రబాబు,రామచంద్ర నాయుడు,గిరిబాబు,శీను రెడ్డి,మోహన్ మరియు నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ త్యాగానికి, విశ్వాశానికి ప్రతీక: ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 28:** బక్రీద్ పండుగ త్యాగానికి, విశ్వాసానికి ప్రతీకని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. దేవుని ఆదేశానుసారం ప్రవక్త ఇబ్రహాం తన ఏకైక కుమారుడు ఇస్మాయిల్ ను బలి ఇవ్వడానికి సిద్ధపడడాన్ని గుర్తు చేసుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ ను నిర్విహించుకోవడం జరుగు తున్నదని ఆయన గుర్తు చేశారు. బక్రీద్ సందర్భంగా ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రార్థనలు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత మరింతపెరగాలని దీని కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల న్నారు. పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి తోడుగా నిలవడం బక్రీద్ పండుగ లక్ష్యమని ఆయన చెప్పారు. అల్లా దయతో ప్రతి ఇంటిలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా, ఎస్ కే బాబు, ఈద్గా కమిటీ ఛైర్మన్ రఫీ, మూర్తుజ, నసరుద్దీన్, ముబారక్, సాబీర్, అజీమ్, జిన్నా, సల్మాన్, అర్షద్, అమీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న బీజేపీ

## - ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకేనా ఈడి
## - సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు



**మదనపల్లి –ఆంధ్రనాడు, మే 28:** కేరళ మాజీ ముఖ్యమంత్రి,సీపీఎం అగ్రనేత పినరయి విజయన్ నివాసాలపై కేంద్ర ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అప్రజాస్వామికంగా జరిపిన దాడులను సిపిఎం అన్నమయ్య జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు.గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ కేరళలో కాంగ్రెస్ తో కుమ్మక్కై ఈడిని ఉసిగొల్పి రాజకీయ కక్షసాధింపుకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీజేపీ అధికార దుర్వినియోగం చేస్తూ,దర్యాప్తు సంస్థలను అస్త్రాలుగా వాడుకుంటోందని మండిపడ్డారు.దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఇటువంటి దాడులకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు.కేరళలో ప్రజాదరణ కలిగిన పినరయి విజయన్ ప్రతిష్టను భంగపరచడానికే కేంద్రం ఈ కుట్రలకు తెరలేపిందన్నారు.ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఇలాంటి దాడులను దేశప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థల దుర్వినియోగాన్ని,ప్రజాస్వామ్యంపై దాడులను తక్షణమే ఆపాలన్నారు.?రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం మానుకోకపోతే ప్రజాస్వామ్యవాదులను,ప్రజలను సమీకరించి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుజాతి ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం ఎన్టీఆర్

**- ఎం తిరుమలరెడ్డి**
**- అందరి పండుగగా టిడిపి మహానాడు వేడుకలు**





**రామచంద్రాపురం–ఆంధ్రనాడు,మే 28:**తెలుగు జాతి ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం,తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, బడుగు బలహీన వర్గాల పెన్నిధి, ఆడపడుచుల ఆశాజ్యోతి, విశ్వ విఖ్యాత నట సార్వ భౌముడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి ప్రశం సించారు. ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా గురువారం రామచంద్రాపురం మండలంలోని రావి ళ్ళవారి పల్లెలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, మండలంలోని మిట్టూరు కమ్యూనిటీ హాల్ లో రెండవ రోజు నిర్వహిస్తున్న వర్చువల్ మహానాడు ప్రాంగణంలో ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారం సాధించి, తెలుగువాడి పౌరుషాన్ని విశ్వ విఖ్యాతం చేసిన అన్న ఎన్టీఆర్ చారిత్రక యుగపురుషుడని చెప్పారు. ఢిల్లీ నడివీధులలో తెలుగువారి ఆత్మగౌరవం మంటగలిసినప్పుడు చూసి ఓర్చుకోలేక రామారావు సినీ రంగాన్ని పక్కనపెట్టి రాజకీయ రంగ ప్రవేశం చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర మహిళ కార్యనిర్వహక కార్యదర్శి, సీనియర్ మహిళా నేత బాదూరు లత సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అప్పటి దుర్భర పరిస్థితుల్లో ప్రజల కనీస అవసరాలైన కూడు,(ఉచిత రేషన్)గూడు(పక్కా ఇల్లు), గుడ్డ (జనతా వస్త్రాలు)వంటి పేద ప్రజల కనీస అవసరాలను సమకూర్చి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. మహిళలకు ఆస్తి లో హక్కు, రాజకీయాలలో రిజర్వేషన్లు కల్పించిన ఘనుడు అన్న ఎన్టీఆర్ అని కీర్తించారు. ఎంతోమంది బడుగు బలహీన వర్గాల వారికి రాజకీయ చైతన్యం కల్పించి ఉన్నత పదవుల అధిరోహణకు దోహదపడ్డాడని గుర్తు చేశారు. సీనియర్ నాయకులు, సింగిల్ విండో అధ్యక్షులు చేకూరి జనార్దన్ చౌదరి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి నుంచి సమాజాన్ని పట్టిపీడిస్తూ ఉండిన కరణం విలేజ్ మనసబు దారి విధానాన్ని రద్దుపరిచి మండల వ్యవస్థను రామారావు రూపొందించారు అన్నారు.ప్రపంచ దేశాలలో సంక్షేమ కార్యక్రమాలకి ఆధ్యుడు ఎన్టీఆరేనని తెలిపారు.ఎం ఎస్ ఎం ఈ రాష్ట్ర డైరెక్టర్ ఎన్ చిన్నబాబు మాట్లాడుతూ బీసీ లకు రాజ్యాధికారం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు, పటేల్ పట్వారీ వ్యవస్త రద్దు, మహిళలకు విద్యా, రాజకీయాల్లో అవకాశాలు వంటి ఎన్నో రాజకీయ సంస్కరణలు చేపట్టారన్నారు. సీనియర్ నేత కొట్టే నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం తెలుగుదేశం పార్టీ సభ్యులంతా, క్రమ శిక్షణ కలిగిన సైనికులుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.అనంతరం టిడిపిలోని 50 మంది సీనియర్ సిటిజెన్లను శాలువలతో ఘనంగా సన్మానించారు. సాయంత్రం నాలుగు గంటలకు టిడిపి కార్యకర్తల ఆనందోత్సవాల నడుమ మహానాడు కార్యక్రమం విజయవంతంగా ముగించారు.పండుగలాగా మహానాడు విజయవంతానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరి నాయుడులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి సేవలు అందించిన సీనియర్ మహిళా నేత బాదురు లతా సుబ్రమణ్యం రెడ్డి తో పాటు పలువురిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తానికొండ కేశవుల నాయుడు,డి బిందు మాధవి, నియోజకవర్గం యువత ప్రధాన కార్యదర్శి ముచ్చెల్లి నాథ్ రెడ్డి, యువత ఉపాధ్యక్షులు కొట్టే ధనంజయ రెడ్డి,మండల యువత అధ్యక్షుడు చేకూరు వెంకటప్రసాద్, టిడిపి మాజీ అధ్యక్షులు నీలకంఠ చౌదరి, కోరా హరి ప్రసాద్,ఈతముక్కల ఉమాపతి నాయుడు,ఏయంసి డైరెక్టర్లు పసుపులేటి విజయ్ కుమార్,దద్దాల రదీష్,మాజీ వైస్ యంపిపి మధుసూదన్ రెడ్డి, ఆర్ కాడు గోపాల్ నాయుడు, మాధవయ్య,బాదురు కోటేశ్వర్ రెడ్డి,బండి విజయ్ కుమార్ రెడ్డి,పంతల వెంకటేష్ నాయుడు,చంద్రబాబు,లెక్కల మహేష్ నాయుడు, రామిరెడ్డి, ఎంపీటీసీ చిన్న, కొట్టే ముద్దు కృష్ణారెడ్డి,సురేందర్ నాయుడు,టి మురళీ నాయుడు,రెడ్డప్ప నాయుడు, పి సురేష్ నాయుడు,ప్రభాకర్ రెడ్డి, ధనంజయులు,బండి రమణారెడ్డి , సుగుణమ్మ,గుణసుందరి,గిరిధర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యుదయానికి ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

**- ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తిరుచానూరులో అల్పాహార పంపిణీ**
**- ఎన్టీఆర్ ఆశయ సాధనకు కట్టుబడి పనిచేయాలి**




**తిరుచానూరు –ఆంధ్రనాడు, మే 28:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా తిరుచానూరులో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సీఆర్ రాజన్ సూచనల మేరకు పేదలకు అల్పాహార పంపిణీ చేపట్టినట్లు రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రోజువారీ కూలీలు, గ్రామపంచాయతీ కార్మికులు, భిక్షాటన ద్వారా జీవనం సాగించే వారికి టిఫిన్ ప్యాకెట్లు, తాగునీటి బాటిళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మునిరత్నం రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమమే ఎన్టీఆర్, కూటమి ప్రభుత్వం, ప్రధాన లక్ష్యమని, సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలను ప్రతి కార్యకర్త కొనసాగించాలని, సేవా కార్యక్రమాల ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ.మునిరత్నం, కె.పెరుమాళ్, ఆర్.శేషాద్రి, సుర బాలాజీ రెడ్డి, బాలయ్య, కుప్పయ్య, సుబ్రహ్మణ్యం వడ్డెర, ఓటేరు రవి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

## సిపిఎం కార్యకర్తల నిరసన



**రేణిగుంట –ఆంధ్రనాడు, మే 28:** రేణిగుంట అంబేద్కర్ విగ్రహం ఎదుట సిపిఎం కార్యకర్తలు గురువారం ఎర్రజెండాలతో నిరసన వ్యక్తం చేశారు.కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ పినరయి విజయన్ ఇంటి పై ఈడి దాడులు దుర్మార్గం అని ఆరోపించారు.రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం కార్యకర్తలు కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ పినరయి విజయన్ ఇంటి పై కేంద్ర ప్రభుత్వ ఆర్థిక దర్యాప్తు సంస్థ ఈడి దాడులు చేయడం ద్వారా కేరళ సిపిఎం విశిష్టతను దిగజార్చడం కోసం బిజెపి కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపి అధికారాన్ని దుర్వినియోగం చేయడం అప్రజాస్వామ్యం, దుర్మార్గం మైన చర్యని దీన్ని యావత్ ప్రజానీకం ఖండించాలని సిపిఎం పార్టీ రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ పిలుపు ఇచ్చారు. ఈడి దాడులు నిరసిస్తూ గురువారం ఉదయం 10:30 నిమిషాలకు రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. మోడీ అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు ఇచ్చారు. పెట్రోల్ ,డీజిల్ గ్యాస్ ధరలు నిత్యవసర సరుకుల ధరలు ప్రజలపై భారంగా మారాయని రైతులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగ యువకులు, మేధావులు బిజెపి ప్రభుత్వంపై నిరాశతో ఉన్నారని వీరంతా గళం విప్పడం కమ్యూనిస్టులు ప్రశ్నించడం కేంద్ర బిజెపి పాలకులకు నచ్చడం లేదని అందుకే ఈడీ, సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు సులోచన, భారతి, పద్మమ్మ, సుబ్రహ్మణ్యం, ఆశీర్వాదం, వెంకటేష్, సీనయ్య, మునిస్వామి, నారాయణ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన నృత్యాలు

**- శిల్పారామంలో బక్రీద్ ప్రత్యేక కార్యక్రమాల్లో ఆకట్టుకునే ప్రదర్శనలు**

**తిరుపతి రూరల్ –ఆంధ్రనాడు, మే 28 :** బక్రీద్ సెలవు సందర్భంగా తిరుపతి శిల్పారామంలో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. నెల్లూరు జిల్లా నరుకూరు గ్రామానికి చెందిన 'సాంప్రదాయ కూచిపూడి కళాక్షేత్రం' ఆధ్వర్యంలో గురువు జి. ఆనంద్ నేతృత్వంలో విద్యార్థులు సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణేశ కౌత్వం, ముద్దుగారే యశోద, భామ కలాపం, తరంగం, దశావతారం, ఆనంద తాండవం, వినరో భాగ్యము విష్ణు కథ తదితర పాటలకు కళా కారులు తరిని, జశ్విత, చైత్ర ప్రభ, చైతన్య లక్ష్మీ కళ్యాణి, అనన్య, ఆరాధ్య, పావని, అమృత, శాన్వి తదితర విద్యార్థుల ప్రతిభ ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం అనంతరం శిల్పారామం పరిపాలన అధికారి ఖదీర్ వలి, ఇంచార్జ్ పరిపాలన అధికారి సూర్య తేజ కళాకారులను, నృత్య గురువును అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం సిబ్బంది పప్పీ, వెంకటేశ్వర రెడ్డి, కళాకారుల తల్లిదండ్రులు విశేష సంఖ్యలో సందర్శకులు పాల్గొన్నారు.



## పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నాం




**రేణిగుంట –ఆంధ్రనాడు, మే 28 :** తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు గురువారం సాయంత్రం రేణిగుంటలో జరిగిన మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ పరిపాలన నిజాయితీగా సాగుతోందని ఆయన అన్నారు . గత వైసిపి ప్రభుత్వం ఇలా కాకుండా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా పార్టీ సహకరిస్తుందని ఎమ్మెల్యే వదల సుధీర్ రెడ్డి అన్నారు. మినీ మహానాడు లో భాగంగా మండల పరిధిలోని మూడు క్లస్టర్ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్చువల్ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నాను. అనంతరం సభా ప్రాంగణంలో కేడర్‌తో కలిసి మహానాడు లైవ్ స్క్రీనింగ్‌ను వీక్షించాము. పార్టీ అధినేత టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశక ప్రసంగం మా అందరిలోనూ సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. మహానాడు థీమ్ స్త్రీ శక్తి' కావడం, అలాగే యువనేత నారా లోకేష్ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న మొదటి మహానాడు ఇదే కావడంతో నియోజకవర్గ కేడర్ అంతా పండుగ వాతావరణంలో మునిగి పోయింది. మండల పరిధిలోని క్లస్టర్ ఇన్చార్జిలు పుష్ప నాదం , సుబ్రహ్మణ్యం రెడ్డి , బుజ్జి నాయుడు పార్టీ నాయకులు మునస్వామి నాయుడు , మహబూబ్బాషా, విద్యాసాగర్, నవాబ్, సుబ్రహ్మణ్యం,కొరియర్ రవి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఘనంగా బక్రీద్ వేడుకలు



**తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, మే 28:**తంబళ్లపల్లి మండల వ్యాప్తంగా బక్రీద్ పర్వదినాన్ని గురువారం ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్దలతో ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారు.బక్రీద్ పండుగ ముందు రోజైన బుధవారం ఉపవాసం ఉండి గతించిన తమ పెద్దలకు చదివింపులు పెట్టి ప్రార్థనలు చేశారు.గురువారం ఉదయమే నూతన వస్త్రాలు ధరించి సామూహికంగా ఈద్గా,మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఒకరినొకరు ఆలింగణం చేసుకుని పండుగ శు భాకాంక్షలు తెలుపుకున్నారు.తంబళ్లపల్లి మండల కేంద్రంలో గురువారం ఉదయం ముస్లింలు రాగిమాను కూడలి వద్దగల పెద్ద మసీదు వద్ద నుంచి సిద్ధారెడ్డిగారిపల్లిలోని ఈద్గా వరకూ సామూహికంగా ర్యాలీగా వెళ్లి ప్రార్థనలు చేశారు.అల్లాపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ..త్యాగాలకు మారుపేరుగా బక్రీద్ పండుగ జరుపుకుంటున్నట్టు ముస్లిం సోదరులు తెలిపారు.అనంతరం అల్లా పేరు మీద పేదలకు దాన ధర్మాలు చేశారు.

## జూన్ 1న ఐటీఐలో జాబ్ మేళా



**తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, మే 28:**ఐటీఐ, డిప్లొమా(పాలిటెక్నిక్), డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులకు జూన్ 1వ తేదీన తంబళ్లపల్లి శ్రీ టీఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఇంచార్జి ప్రిన్సిపాల్, టీఓ నాగరాజ తెలిపారు.జాబ్ మేళాకు అమర్ రాజా బ్యాటరీస్ బంగారుపాళ్యం,శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిట్ తిరుపతి,ఎల్ ఢటీ కాంచిపురం,యూనో–మిస్ కంపెనీ బెంగళూరు,వీటీఎస్ కార్పొరేట్ సర్వీసెస్ లిమిటెడ్ బెంగళూరు,సాయిదీప్ ఎంటర్ప్రైజెస్ బెంగళూరు,ఎల్‌డటీ బెంగళూరు వంటి ప్రముఖ కంపెనీలతో పాటు స్కిల్ హబ్ తరపున మరిన్ని కంపెనీలు హాజరైవుతాయని పేర్కొన్నారు.ఐటీఐలో డ్రాఫ్ట్స్ మాన్ సివిల్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ ట్రేడ్లలో ఈ ఏడాది కోర్సు పూర్తి చేసిన వారు, గతంలో పాసైన వారు అలాగే పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు.కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ, నైపుణ్యం ఆధారంగా ఎంపిక చేసుకుంటారని తెలిపారు.ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో జూన్ 1న ఉదయం 10గంటలకు తంబళ్లపల్లి ఐటీఐ వద్దకు హాజరు కావాలని ఇంచార్జి ప్రిన్సిపాల్ కోరారు.


## పేరడం గ్రామంలో వెలగని వీధిలైట్లు

**- చీకట్లో పేరడం గ్రామం ప్రజల ఇబ్బందులు**



**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 28:** సత్యవేడు మండలం పేరడం గ్రామంలో వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత రహదారులన్నీ చీకట్లోనే మగ్గుతున్నాయి. రాత్రి వేళల్లో కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటిని ఆసరాగా చేసుకుని పాములు, ఇతర విషకీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు రాత్రి పూట బయటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు, పంచాయతీ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మండల అధికారులు స్పందించి, పేరడం గ్రామంలో పాడైన వీధిలైట్లను తక్షణమే పునరుద్ధరించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## సన్మానం



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 28:** నాగలాపురం మండలంలో గురువారం రెండవ రోజు జరిగిన మహానాడు కార్యక్రమంలో నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయ పాలకమండలి సభ్యుడు నెల్సన్ మండేలా ను నాగలాపురం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు టీజేబి ప్రణీత్ రెడ్డి సాలువ పూలమాలవేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస యాదవ్, రాజశేఖర్ యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన తెలుగువారి పసుపు పండుగ

## - పార్టీకి సేవలు అందించిన సీనియర్లకు ఘన సన్మానం





**చంద్రగిరి –ఆంధ్రనాడు, మే 28** : దుబారా ఖర్చులను తగ్గించుకోవాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుతో ప్రతి సంవత్సరం లక్షలాది మంది కుటుంబ సభ్యులతో నిర్వహించుకుని మహానాడు కార్యక్రమాన్ని ఉచువల్ విధానంలో రెండు రోజులు నిర్వహించుకున్నారు.

ఈ తెలుగు వారి పసుపు పండుగ అంగరంగ వైభవంగా చరిత్రలో కనీ విని ఎరుగని రీతిలో నిర్వహింపబడింది.చంద్రగిరి నియోజకవర్గంలో రెండో రోజు పసుపుపండుగ మహానాడు అంగరంగ వైభవంగా కొనసాగింది.ఎమ్మెల్యే పులివర్తి నాని చిన్నగొట్టిగల్లు ఎర్ర వారి పాలెం మండలాలలో,ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధా రెడ్డి చంద్రగిరి తిరుపతి రూరల్ మండలాలలో, ఎమ్మెల్యే తంగ నాయుడు యువ నాయకుడు పులివర్తి వినీల్ పాకాల మండలంలో నిర్వహించిన మహానాడులో పాల్గొన్నారు. ప్రతి క్లస్టర్లో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నందమూరి తారకరామారావు 103వ జయంతి సందర్భంగా భారీ ఎత్తున కేక్ లను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. చంద్రగిరి యంయస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన మహానాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని గారి సతీమణి పులివర్తి సుధా రెడ్డి హాజరయ్యారు. తెలుగుజాతికి సగర్వ కారకుడు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి నాయకులతో కలిసి నివాళులు అర్పించారు.కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరిని పులివర్తి సుధా రెడ్డి పేరుపేరునా అభిమానంగా,ఆప్యాయంగా పలకరించారు. అనంతరం మంగళగిరి ప్రధాన పార్టీ కార్యాలయంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని డిజిటల్ స్క్రీన్ లపై పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు పార్టీలో సేవ చేస్తున్న సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు.కార్యకర్తలకు, యువతకు పేరు పేరునా ధన్యవాదాలను తెలియజేశారు. మండలంలోని క్లస్టర్ల వారిగా మహానాడులో చేసిన తీర్మానాలు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని పులివర్తి సుధా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఏఎంసీ చైర్మన్ గౌస్ బాషా,సీనియర్ నాయకులు రమేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఏజీ పల్లి బాల, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి హేమంబరధర రావు, తులసిశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఆదూరి నాగరాజు నాయుడు, ప్రభాకర్, సునీల్ సక్కూరు ధనంజయ రెడ్డి, విసిరిపాటి శంకర్, గ్యాస్ నాగరాజు, మంగాపురం భాస్కర్, బాలసుబ్రమణ్యం,రాజులం గారి వినోద్, ప్రవీణ్, మండి రావు, గోపి,హరి, మండల మహిళా అధ్యక్షురాలు కొత్తపల్లి సునీత, వడ్లమూడి సునీత, నాయుడమ్మ,భూదేవి, పెద్ద ఎత్తున మహిళలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**తంబళ్లపల్లిలో...**టీడీపీ వర్చువల్గా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని రెండవ రోజు తంబళ్లపల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పండుగలా నిర్వహించారు. గురువారం ఉదయం తంబళ్లపల్లి మండల కేంద్రంలోని రెండు కళ్యాణ మండపాల్లో టీడీపీ వ్యవస్థాపకులు, తెలుగుదేశం ప్రజల ఆరాధ్య దైవం స్వర్గీయ నందమూరి తారక





రామారావు జయంతిని వేడుకలా జరుపుకున్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు తంబళ్లపల్లిలో 3,4క్లస్టర్లలో నిర్వహిస్తున్న డిజిటల్ మహానాడులో పాల్గొన్నారు. తెలుగుజాతికి ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు.ఎన్టీఆర్ పాలనను స్ఫూర్తిగా తీసుకుని పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. వేదికల వద్ద నాయకులు, కార్యకర్తలకు భోజనం, ఏర్పాట్లను క్లస్టర్ ఇంచార్జిలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి,టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, సిద్దమ్మ, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షులు తులసీధర్ నాయుడు, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు దేరంగుల చంద్ర, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్, టీడీపీ మండల బీసీ నాయకులు పురుషోత్తం, వీరాంజనేయులు,మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు,గుండ్లపల్లి యూనిట్ ఇంచార్జి కాలా నారాయణ,తెలుగు యువత నాయకులు సుగవాసి శివకుమార్, మధు నాయుడు, నరసింహులు, మాజీ జెడ్పీటీసీ రామచంద్ర, మాజీ సర్పంచి ఉత్తం రెడ్డి, మాజీ వార్డు సభ్యులు జగదీష్, మండల వికలాంగ అధ్యక్షులు రామాంజులు, మాజీ గ్రామాధ్యక్షుడు బోయపల్లె శివ, అన్ని గ్రామాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు,బేరి శ్రీనివాసులు,సుధాకర్ రెడ్డి,నరేంద్ర రెడ్డి,సిద్ధారెడ్డి,లోకేశ్వర్ రెడ్డి,బాలాజీ, రెడ్డెప్ప, శివకృష్ణ,మదన,శ్రీనివాసులు,ఐసుల కిట్ట, సలాది రాజశేఖర్,రఘుపతి, శీన,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహానాడుతో పసుపుమయమైన కేవీబీ పురం...



**కేవీబీ పురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో...**

మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమాలు అట్టహాసంగా ముగిశాయి. రెండు రోజుల పాటు సాగిన ఈ వేడుకలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. మహానాడు సందర్భంగా మండల వ్యాప్తంగా పసుపు జెండాలు, ఫ్లెక్సీలు, కటౌట్లు అలరించగా కేవీబీ పురం మొత్తం పసుపుమయంగా మారింది.అలాగే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాల సాధనకే పార్టీ కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు.మండల పార్టీ అధ్యక్షుడు మునస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాదిమంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై పండుగ వాతావరణాన్ని తలపించారు. వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రసంగాలను వీక్షించిన కార్యకర్తలు ఉత్సాహంతో నినాదాలు చేస్తూ సభ ప్రాంగణాన్ని మార్మోగించారు.ఈ సందర్భంగా మునస్వామి యాదవ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేలా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ వ్యక్తిగత విభేదాలు పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఇప్పటివరకు జరిగినది ఒక ఎత్తయితే ఇకపై జరిగేది మరో ఎత్తు అంటూ కార్యకర్తల్లో మరింత జోష్ నింపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ప్రకాష్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ దొరబాబు నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి లోకేష్ నాయుడు, తిరుపతి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్ రెడ్డి, మాధవరెడ్డి,నియోజకవర్గ యువత అధ్యక్షుడు లక్ష్మీపతి రాజు,మండల యువత అధ్యక్షుడు వాసు నాయుడు, వెంకట కృష్ణయ్య, కరపారెడ్డి బాలు, ఐ టి డి అధ్యక్షుడు అఖిల్, వెంకటేష్, మునికృష్ణ, హరికృష్ణ, శీను తదితరులు పాల్గొన్నారు.

**నాగలాపురంలో...** తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని ఈసారి హైబ్రిడ్



మోడ్లో నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు పార్టీ అధినాయకత్వం క్లస్టర్ స్థాయిలో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహించాలని ఆయా క్లస్టర్ ఇన్చార్జిలకు, మండల అధ్యక్షులకు దిశా నిర్దేశం చేసింది. ఇందులో భాగంగానే గురువారం నాగలాపురం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు టీజేబి ప్రణీత్ రెడ్డి ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు వద్ద ఉన్న అనుగ్రహ కల్యాణ మండపంలో మహానాడు కార్యక్రమం వర్చువల్ విధానంలో నిర్వహించారు.

ఈ నేపథ్యంలో వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్స్ ద్వారా మంగళగిరిలో ప్రారంభమైన రెండవ రోజు మహానాడు కార్యక్రమాలను కార్యకర్తలు నేతలు తిలకించారు. అంతకుమునుపు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 103 వ జన్మదిన సందర్భంగా మండల అధ్యక్షుడు టీజేబి ప్రణీత్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి, కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్థిబాన్, టి.జే.బాలాజీ, సుబ్రహ్మణ్యం రాజు, శ్రీనివాస యాదవ్, షామీఉల్లా, ఎం.డి.కుమార్, వెంకటేష్, మండేలా, రుద్రయ్య, మాతయ్య, నాగరాజు, నరేంద్ర రెడ్డి, రషీద్, షరీఫ్, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ జాతరలో పాల్గొన్న నూకతోటి రాజేష్



**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 28:**

సత్యవేడు మండలం ముసలరాజు కండ్రిగ గ్రామంలో నిర్వహించిన పోలేరమ్మ జాతరకు ఎంపీటీసీ మోహన్ రెడ్డి ఆహ్వానించడంతో గురువారం సత్యవేడు నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, వైస్సార్సీపీ నాయకులు రావడంతో ఎంపీటీసీ మోహన్ రెడ్డి ఆలయ మర్యాదలతో సన్మానించి, ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా నూకతోటి రాజేష్ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు ప్రకృతి సహకరించి సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలతో, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర స్థాయి నాయకులు బీరేంద్ర వర్మ, నిరంజన్ రెడ్డి, సీనియర్ నాయకులు బెల్ట్ రమేష్, భాను ప్రకాష్ రెడ్డి, పునిద్ కుమార్, సురేష్, సెంథిల్, పళని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

## - ఐ.ఎఫ్.టి.యు డిమాండ్

**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 28:** నాగలాపురం మండలంలో పనిచేస్తున్న మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పని చేసే ప్రదేశంలో తాత్కాలిక టెంట్ ద్వారా నీడ, పరిశుభ్రమైన త్రాగునీరు సౌకర్యం కల్పించాలని ఐ.ఎఫ్.టి.యు నాయకులు ఆర్.మురుగేషన్ డిమాండ్ చేశారు. నాగలాపురం పంచాయతీకి చెందిన గ్రామీణ ఉపాధి కూలీలు చెరువులో పూడికి తీసే పని చేస్తుండగా ఐ ఎఫ్ టి యు నాయకులు ఆర్ మురుగేష్ సందర్శించి పని దగ్గర ఉన్న పరిస్థితుల్ని కూలీలను అడగగా వారు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు సుమారు 10గ్రూప్ లు 120మంది ఉపాధి కూలీలు ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు పనిచేస్తున్నారని, తొమ్మిది గంటలకే ఎండ తీవ్రత ఎక్కువ అవుతుందని ఎలాంటి తాత్కాలిక నీడ, త్రాగునీటి సౌకర్యం కల్పించడం లేదని ఆవేదన తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు ఉపాధి హామీ కూలీలకు పలు సౌకర్యాలు కల్పించాలని కోరారు.



# పేద ప్రజల అభివృద్ధి కోసమే

- పేదవాడి గుండెచప్పుడే టీడీపీ - శాసనమండలి చీఫ్ విప్ కంచర్ల శ్రీకాంత్ - ఆర్టిసి వైస్ చైర్మన్ మునిరత్నం

# ఉద్భవించింది తెలుగుదేశం పార్టీ

**రామకుప్పం–ఆంధ్రనాడు, మే 28:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పుట్టినరోజు వేడుకలను రామకుప్పం మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు రామకుప్పంలోని ఎన్టీఆర్ విగ్రహానికి శాసనమండలి చీఫ్ విప్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం రాష్ట్ర గ్రంథాలయ బోర్డు డైరెక్టర్ మునుస్వామి రామకుప్పం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం కేక్ కట్ చేసి పేదలకు పంచడం జరిగింది రామకుప్పం లోని ఎం ఆర్ ఆర్ కళ్యాణమండపం, ఆనీగానూరు శ్రీ వాసవి కళ్యాణ మండపం లో మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు గ్రామీణ ప్రాంతాల నుంచి తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఆనిగానూరు నందు జరిగిన మహానాడు కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు ఇందులో భావన భువన నృత్యం చాలా కట్టుకున్నది నేటి తరానికి తగిన విధంగా వారు నృత్యం చేశారు మహానాడులో ఈ కార్యక్రమం చాలా ఆకర్షణీయంగా ఉన్నది మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను ఉద్దేశించి శాసనమండలి చీఫ్ విప్ కంచర్ల శ్రీకాంత్ ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం మాట్లాడుతూ పేదవాడి గుండె చప్పుడు నుంచి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావించినదని ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పేద ప్రజలవై అభివృద్ధి లక్ష్యంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు అలపెరుగని పోరాటం చేశారన్నారు అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ కూడా



ముఖ్యమంత్రి ఎన్టీరామారావు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అభినందించారన్నారు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఎన్టీఆర్ బాటలోనే నడుస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పదం వైపు నడిపిస్తున్నాడన్నారు తండ్రి తనయులు రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి సూపర్ సిక్స్,ద్వారా పేద ప్రజానీకానికి అండగా నిలిచారన్నారు దాంతోపాటు మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణం కు అవకాశం ఇవ్వడం గొప్ప విషయం అన్నారు దాంతోపాటు వచ్చే ఎన్నికలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని ప్రకటించారన్నారు ప్రజల కోసమే ఉద్భవించిన తెలుగుదేశం పార్టీని ప్రజలు ఆదరించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ బోర్డు డైరెక్టర్ మునస్వామి మండల టిడిపి అధ్యక్షులు వెంకటరమణ ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్ మాజీ మండల పార్టీఅధ్యక్షులు ఆనంద్ రెడ్డి ఆంజనేయ రెడ్డి



క్లస్టర్ ఇంచార్జిలు ఏ రవి రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాలాజీ నాయక్, ఎంపీపీ సులోచన గుర్రప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామయ్య గౌడ్, నాగభూషణం రే స్కో, వైస్ చైర్మన్ విశ్వనాథ్, తెలుగుదేశం పార్టీ నాయకులు , చిన్ని కృష్ణ, చలపతి,రామమూర్తి ,జయశంకర్, చంద్రారెడ్డి ,శంకర్ చలం, మహాదేవి, పత్ర నారాయణ, కృష్ణా నాయక్, టీవీ రవి, బాలు, సుబ్రి మంజునాథ్, మురళి, రఘు, సత్తి, కుమార్ ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు

# తెలుగువారి కీర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్

- మహానాడు ముగింపులో ఎమ్మెల్యే షాజహాన్ బాషా



**మదనపల్లి –ఆంధ్రనాడు, మే 28:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చి రాష్ట్ర ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిన స్వర్గీయ నందమూరి తారకరామారావు 104వ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.మహానాడు పరిశీలకులు నెట్టెం వెంకటేష్,పట్టణ అధ్యక్షుడు అరుణ్ తేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ సర్కిల్లో తెలుగుదేశం కుటుంబ సభ్యులతో కలిసి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు.సంక్షేమం అంటే భారతదేశంలో మొదటగా ప్రవేశపెట్టి ఆంధ్ర ప్రజల ఆరాధ్య దైవంగా నేటికీ చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారి,మార్పురి గాంధీ,రాటకొండ భారతి,శ్రీరామ నాగమణి,పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో మహానాడు వేడుకలు..

- అంబరాన్ని అంటిన సంబరం..
- భారీ స్క్రీన్‌లపై నాయకుల ప్రసంగాలను ఆసక్తిగా వీక్షించిన కార్యకర్తలు..
- ఎన్టీఆర్‌కు ఘన నివాళులతో ముగిసిన మహానాడు..
- సంక్షేమం, అభివృద్ధికి టీడీపీయే చిరునామా అన్న నేతలు..





**తిరుపతి, ఏర్పేడు–ఆంధ్రనాడు, మే 28:** నందురెండో రోజు మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బోడుగు ముని రాజా యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో.తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలు మండలంలో రెండవ రోజు పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన హైబ్రిడ్ మహానాడు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు సమావేశాలను భారీ ఎల్ఈడి స్క్రీన్‌ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయగా నాయకుల ప్రసంగాలను కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు. మహానాడు సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజల్లోకి వెళ్లే విధానం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారంపై సీనియర్ నేతలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయిలో మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహానాడు చివరి రోజు సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక నందమూరి తారక రామారావుకు నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సేవలో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మహానాడు ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి,, హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడుగు రాజా యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు శివశంకర్ రెడ్డి, సూరి నాయుడు,పీ.ఏ.సీ, చైర్మన్ మహేష్ రెడ్డి, మాజీ ఉప మండల అధ్యక్షులు మురగయ్య, నాయకులు నాగేశ్వరావు, వేముల జగదీష్ నాయుడు, కే.కే .రమణ, రచేతి సుబ్రహ్మణ్యం, గుణ యాదవ్, నరసింహులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**పుంగనూరులో...** పుంగనూరు మండలంలో పట్టణ గ్రామీణ ప్రాంతాలు కాకుండా ప్రతి చోట నందమూరి ఆశయాలు ప్రతి ఒక్కరూ సాధించాలంటూ స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పుంగునూరు మండల ముఖ్య నాయకుడు మాధవరెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నందమూరి అభిమానులకు ఘనంగా సన్మానం చేశారు, నందమూరి తారక రామారావు 103వ జయంతి కార్యక్రమాలను పుంగనూరు పట్టణం ఎన్టీఆర్ క్లినిక్ నిర్వాహకుడు నందమూరి తారకరామా పేద బడుగుల సేవా సంస్థ అధ్యక్షుడు దుద్యాల అప్పిరెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాధవ రెడ్డి ఆధ్వర్యంలో మహానాడు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. పట్టణ ప్రాంతమైనటువంటి ట్రావెల్స్ బంగ్లాలో పట్టణ అభివృద్ధి కమిటీ నాయకుడు సివిరెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు, రూరల్ ప్రాంతమైనటువంటి ఈడిగపల్లి వద్ద, భీమనేని రెస్టారెంట్లో సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో ఘనంగా నందమూరి తారక రామారావు గారి జన్మదిన వేడుకలు నిర్వహించారు. .ఈ కార్యక్రమంలో పుంగనూరు మండల, పట్టణ ప్రాంతాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

**పలమనేరులో..** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక



మహానాడు కార్యక్రమాలు పలమనేరు నియోజకవర్గంలో రెండో రోజైన గురువారం ఘనంగా కొనసాగాయి. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో అన్ని క్లస్టర్ లలోని సభా ప్రాంగణాలు సందడిగా మారాయి. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలపై నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ.... తెలుగుదేశం పార్టీ స్థాపన నుంచి ప్రజల కోసం నిరంతరం పోరాడుతూ వస్తోందని పేర్కొన్నారు. పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమం, మహిళా సాధికారత లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని మహానాడును విజయవంతం చేశారు.కార్యక్రమాలలో పట్టణ టిడిపి నాయకులు ఆర్బీసీ కుట్టి, గిరిబాబు,మార్కెట్ కమిటీ అధ్యక్షులు రాజన్న,సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి.బాలాజీ,గ్యాస్ నాగరాజు,సరస్వతి కేఫ్ రూపేష్, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్‌లు చాంద్ బాషా,కిరణ్ కుమార్,సుబ్బనాగయ్య,బ్రహ్మయ్య, వి.కోట రామ చంద్రనాయుడు, పలమనేరు రూరల్ నాయకులు నాగరాజ రెడ్డి, గంగవరం మాజీ సర్పంచ్ మురళి,పల్లె రుచులు అమరనాదరెడ్డి,ఉగ్రాణం సోమశేఖర్ నాయుడు,గంగవరం నాయకులు గిరిధర గోపాల్, ప్రతాప్ కుమార్ రెడ్డి,గంగమ్మ గుడి అధ్యక్షులు గంటా వూరు శ్రీధర్,మదన్,రాష్ట్ర కురబ సంఘం డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడ్, జిల్లా ఈడిగ గౌడ్ సంఘం అధ్యక్షులు దీపికా కృష్ణ మూర్తి,చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు ఖాజా పీర్,ఈశ్వరాలయం అధ్యక్షులు మురళీ కృష్ణ,మహిళా నాయకురాలు పర్వీన్,సుదర్శన్ బాలాజీ,డిష్ రమేష్,బి.ఆర్.సి. కుమార్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**అమరనాథ్ రెడ్డి ప్రసంగం**



మహానాడు మొదటి, రెండవ రోజులలో జరిగిన కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలమనేరు శాసన సభ్యులు ఎన్. అమర నాదరెడ్డి మంగళగిరిలో పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్ర విభజన అయిన తర్వాత... రాజధాని లేక పరిశ్రమలు లేక ఆర్థిక వనరులు లేక పూర్తిగా సంక్షోభంలో ఉన్నటువంటి సమయంలో ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రయత్నం చేసినటువంటి నాయకుడు మన చంద్రబాబు నాయుడు. అదేవిధంగా ఈ రెండు సంవత్సరాలలో...... ఒక నమ్మకాన్ని క్రియేట్ చేసి ఈ రాష్ట్రానికి మళ్లీ పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకురావడానికి రాత్రి పగలు తేడా లేకుండా ప్రపంచం మొత్తం కూడా తిరిగి నమ్మకాన్ని మళ్లీ కల్పించినటువంటి మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనాయకుడు లోకేష్ బాబు అని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నా. ఎన్నికలప్పుడు 'యువగళం' పాదయాత్ర సందర్భంలో 20 లక్షల ఉద్యోగాలు మేము కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు మంత్రి నారా లోకేష్ కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి 24 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలను రాబోయే కాలంలో కల్పించేటటువంటి అవకాశాన్ని తీసుకువస్తున్నారన్నారు.

అదేవిధంగా గడచిన రెండు సంవత్సరాలలో దాదాపు ఏడు లక్షల మంది ప్రైవేటుకు సంబంధించిన టువంటి పెట్టుబడుల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే... ప్రభుత్వ పరంగా ఆరోజు ఎన్నికలకు ముందు చెప్పినటువంటి మాట ప్రకారం, 'మెగా డీఎస్సీ' ద్వారా దాదాపు 15,941 మందికి, కానిస్టేబుల్ 6,100 మందికి, ఎస్ఐలకు అదేవిధంగా 414 మందికి... ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా ఉద్యోగాలు కల్పించినటువంటి ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని ఈ సందర్భంగా కూడా నేను తెలియజేసుకుంటున్నాని ప్రసంగించారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రశంసలు
- కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**మదనపల్లి –ఆంధ్రనాడు, మే 28:** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేత ఎన్టీఆర్ అని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,శాసనసభ్యులు షాజహాన్ బాషాలు పేర్కొన్నారు.మదనపల్లి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ




మందిరంలో గురువారం స్టెప్ మరియు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా,జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు సినీ రంగంలో అపూర్వమైన కీర్తిని సాధించడమే కాకుండా,తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.1949లో మనదేశం.సినిమాతో సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన,సామాజిక, చారిత్రక, పౌరాణిక చిత్రాల్లో నటించి కోట్లాది ప్రజల అభిమానాన్ని సంపాదించారని తెలిపారు.ముఖ్యంగా శ్రీరాముడు,శ్రీకృష్ణుడు, పరమశి వుడు వంటి పాత్రల ద్వారా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.రాజకీయ నాయకుడిగా కూడా ఎన్టీఆర్ ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా తాలూకాలను మండలాలుగా విభజించి గ్రామీణ పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేశారని చెప్పారు.మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించడం,రూ.2లకు కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టడం వంటి నిర్ణయాలు దేశవ్యాప్తంగా సంక్షేమ పాలనకు మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు.మహిళా విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు.మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ఎన్టీఆర్ మాట ఇచ్చిన వెంటనే అమలు చేసే దృఢ సంకల్ప నాయకుడన్నారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా భావించి అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వెంటనే పరిష్కార మార్గాలు చూపిన మహానేతగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.ఎన్టీఆర్ ఆలోచనలు,ప్రజాసేవా తత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు సినీ పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన మహానటుడని తెలిపారు.పౌరాణిక,చారిత్రక,సామాజిక చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.సినీ రంగంలో సాధించిన ప్రజాదరణను ప్రజా సేవకు వినియోగించి రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సంక్షేమానికి కృషి చేశారని పేర్కొన్నారు.కళాకారుడిగా మాత్రమే కాకుండా సమాజ సేవకుడిగా కూడా ఎన్టీఆర్ చిరస్మరణీయులయ్యారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి నాగభూషణం,డీఎల్‌డీఓ లక్ష్మీపతి,టిడిపి నాయకులు రెడ్డి రాయల్,జిల్లా క్రీడల అధికారి,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ANDHRANADU
TELUGU DAILY

శుక్రవారం
29.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

## అమ్మవారిని సేవలో ఏపీ సీఎంఓ కార్యదర్శి కార్తికేయ మిశ్రా



**తిరుచానూరు –ఆంధ్రనాడు, మే 28:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం కార్యదర్శి (సీఎంఓ) కార్తికేయ మిశ్రా (ఐఏఎస్) గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద సీఎంఓ కార్తికేయ మిశ్రాకి ఆలయ సూపరింటెండెంట్ ముని చంగల్రాయులు, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## బక్రీద్ సందర్భంగా భారీ మజ్జిగ పంపిణీ




**పీలేరు–ఆంధ్రనాడు, మే 28:** సమాజ సేవలో నిరంతరం ముందుండే "మేము సైతం సమాజం కోసం" స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బక్రీద్ (ఈద్–ఉల్–అజ్హా) పండుగ సందర్భంగా భారీ మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్న ఈ సంస్థ, ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా బక్రీద్ పర్వదినాన దాదాపు 5,000 నుంచి 6,000 మందికి చల్లని మజ్జిగను పంపిణీ చేసింది. పండుగ ప్రార్థనల అనంతరం ఈద్గా వద్దకు వచ్చిన భక్తులు, స్థానిక ప్రజలు, బాటసారులకు మజ్జిగ అందజేశారు. "మానవ సేవయే మాధవ సేవ" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించడం, పండుగ సందర్భంగా సోదరభావాన్ని చాటడం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన పీలేరు పోలీస్ శాఖ అధికారులు, సిబ్బందికి, ముఖ్యంగా ట్రాఫిక్ మరియు భద్రతా ఏర్పాట్లలో సహకరించిన పోలీసులకు సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పీలేరు పట్టణ ఈద్గా పెద్దలు, సంస్థ కమిటీ సభ్యులు, వాలంటీర్లు అందించిన సహకారాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో "మేము సైతం సమాజం కోసం" స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకులు షేక్ షాహిన్ షా, మోదీన్ భాషా (బుజ్జు), యువత మరియు పలువురు సేవాభావం కలిగిన వ్యక్తులు పాల్గొన్నారు.

## ' పులిగోరు' చే టీడీపీ సీనియర్ కార్యకర్తలకు సన్మానం..

**తిరుపతి, మే 28 (ఆంధ్ర నాడు):** తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు అదే పార్టీలో కొనసాగుతున్న పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలను తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణ రెడ్డి చేతుల మీదుగా శాలువాతో ఘనంగా సత్కరించి శ్రీవారి చిత్రపటాలను బహూకరించారు. మహానాడు రెండవ రోజు అయినా గురువారం టిడిపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, తిరుపతి కోపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుండి నందమూరి తారక రామారావు అభిమానులుగా, తిరుపతి నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులతో నిమిత్తం లేకుండా కేవలం నందమూరి తారక రామారావు పై ఉన్న అభిమానంతో పార్టీ కార్యకర్తల్లా కాకుండా సుశిక్షితులైన సైనికుల్లాగా పార్టీ అభివృద్ధి కోసం, అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తూనే ఉన్నారని కొనియాడారు. అలాంటి వారిని తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ మరువదని, వారికి రాబోయే రోజులలో పార్టీలో సముచిత స్థానం గౌరవం లభిస్తాయని పులిగోరు మురళీకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరిని ఆయన శాలువాతో సత్కరించి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. సన్మానం స్వీకరించిన వారిలో సూరా సుధాకర్ రెడ్డి, రామదాసు ముని రామయ్య, గాలి రాజేంద్రనాయుడు, టీటీడీ ఎంప్లాయిస్ కోపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మధు, దుర్గాప్రసాద్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు పార్టీ నేతలు దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, ఈతమాకుల హేమంత్ యాదవ్ గంజి సుధాకర్ రెడ్డి చింతా భరణి యాదవ్, ఎస్ వి ఎం వెంకటేష్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# టీటీడీలో రికార్డులు తిరగరాసిన "నల్ల బంగారం"

**-ఈ నెలలో ఇప్పటివరకు 12 లక్షలకు పైగా భక్తులు తలనీలాల సమర్పణ**
**- భక్తులకు ఇబ్బందులు లేకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు**



**తిరుమల– ఆంధ్రనాడు, మే 28:**

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకుంది. ఈ "నల్ల బంగారాన్ని" గత సంవత్సరాల కంటే ఈ ఏడాది మే నెలలో అత్యధికంగా సమర్పించడం విశేషం. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ పటిష్ట ఏర్పాట్లు చేపట్టి, నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. ఈ ఏడాది మే నెలలో 27వ తేది వరకు 12,43,063 మంది భక్తులు తలనీలాలు సమర్పించడం విశేషం. కాగా 2024 మే నెలలో మొత్తం 10,65,729 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా, 2025 మే నెలలో 10,18,370 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఇటీవల వేసవి సెలవులు, వారాంతపు రద్దీ కారణంగా తిరుమలలో భక్తుల రాక భారీగా పెరిగింది. మే 18 నుండి 23 వరకు వరుసగా ఆరు రోజుల పాటు ప్రతిరోజూ 50 వేలకుపైగా భక్తులు తలనీలాలు సమర్పించారు. ముఖ్యంగా మే 23వ తేదీన ఒక్కరోజే 57,580 మంది భక్తులు తలనీలాలు సమర్పించడం జరిగింది.

**వివిధ ప్రాంతాల్లో కళ్యాణకట్టలు**

భక్తులకు వేచిచూసే సమయం తగ్గించేందుకు, సౌకర్యవంతంగా తలనీలాలు సమర్పించేలా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాన కళ్యాణకట్టతో పాటు పీఏసీ–1, పీఏసీ–2, పీఏసీ–3, పీఏసీ–5, జీఎన్సీ, హెచ్‌వీసీ, సప్తగిరి విశ్రాంతి గృహం, నందకం విశ్రాంతి గృహం, కౌస్తుభం విశ్రాంతి గృహం, శ్రీవేంకటేశ్వర విశ్రాంతి గృహం, శ్రీ పద్మావతి విశ్రాంతి గృహం ప్రాంతాల్లో మొత్తం 11 మినీ కళ్యాణకట్టలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి.

**విశేష స్థాయిలో సేవలు అందిస్తున్న క్షురకులు**

టీటీడీలో మొత్తం 1,152 మంది క్షురకులు భక్తులకు సేవలు అందిస్తున్నారు. వీరిలో 269 మంది మహిళా క్షురకులు కూడా ఉన్నారు. భక్తులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో సేవలు అందించేందుకు టీటీడీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఒక్కో క్షురకుడు తమ విధుల్లో భాగంగా 6 గంటల షిఫ్టులో 40 మందికి క్షర కర్మ చేస్తారు. మరోవైపు పెరిగిన రద్దీకి అనుగుణంగా 250 మంది సిబ్బందికి ప్రతిరోజూ అదనంగా విధులు కేటాయించడంతో ఒక్కో క్షురకుడు అదనంగా దాదాపు 50 మంది భక్తులకు క్షర కర్మ చేస్తూ నిరంతరాయంగా సేవలు అందిస్తున్నారు.

**కళ్యాణకట్టలో పరిశుభ్రతకు పెద్దపీట**

భక్తులు అత్యంత పవిత్రంగా భావించే కళ్యాణకట్టల్లో టీటీడీ పరిశుభ్రతకు పెద్దపీట వేసింది. భక్తులకు కేటాయించే బ్లేడ్లను క్షురకులు ముందుగా సోడియం సొల్యూషన్ లో ముంచి ఆ తర్వాత డెటాయిల్ తో శుభ్రపరచడం జరుగుతోంది. అదేవిధంగా తలనీలాలను ఎప్పటికప్పుడు సేకరించి భద్రపరచడం జరుగుతోంది. ప్రతి కళ్యాణకట్టలో భక్తులకు స్నానపు గదులతో పాటు వేడి నీరు అందుబాటులో ఉంచడం జరిగింది. తలనీలాల సమర్పణ అనంతరం భక్తులకు చందనం బిళ్లలను కూడా టీటీడీ అందిస్తోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తలనీలాల సమర్పణ కేంద్రాల్లో పారిశుధ్యం, తాగునీరు, కూర్చునే సదుపాయాలు, టోకెన్ విధానం తదితర ఏర్పాట్లను టీటీడీ మరింత బలోపేతం చేసింది.





# టిడిపి సిద్ధాంతాలు ప్రజలలోకి విస్తృత ప్రచారం

**-ఎంఆర్ పల్లి క్లస్టర్--6 లో మహానాడు--2026**
**- ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ**

**తిరుపతి – ఆంధ్రనాడు, మే 28:**

తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక, మహానేత నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని మహానాడు--2026 రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా తిరుపతి ఎంఆర్పల్లి సీతమ్మ నగర్ నందు క్లస్టర్--6 ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాని క్లస్టర్ ఇన్‌చార్జ్ సూరా సుధాకర్ రెడ్డి , కో-క్లస్టర్ ఇన్‌చార్జ్ కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు దేశం పార్టీ తిరుపతి ఇంచార్జ్ మన్నూరు సుగుణమ్మ ,తుడ చైర్మన్, తెలుగు దేశం పార్టీ తిరుపతి జిల్లా జనరల్ సెక్రటరీ డాలర్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే ఎంఆర్ పల్లి 19, 20, 21, 22 డివిజన్లకు చెందిన వార్డ్ అధ్యక్షులు, యూనిట్ ఇన్‌చార్జులు, జనరల్ సెక్రటరీలు, వార్డ్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు మరియు నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ కార్యక్రమం ద్వారా ఎన్టీఆర్ ఆశయాలు, తెలుగు దేశం పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లో మరింత విస్తరించాలనే సంకల్పాన్ని నాయకులు వ్యక్తం చేశారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733